# క్షణంతా నీకోసమే

## రాధిక

డియర్ సుజాత.

నా బాధ ఎవరితో చెప్పుకోవాలో అర్థం కాక, నీకు ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. నా పెర్సనల్ విషయాలు నీకు తప్ప, ఎవరికీ చెప్పనని నీకు తెలుసుకదా! పెదవి దాటితే పృథివి దాటుతుందన్న సామెత ఉంది. అది అక్షరాల నిజం. దయయుంచి నేను వ్రాసిన విషయం నీ మనసులో నే ఉంచుకో. ఎవరికీ చెప్పవద్దు. నాకాపురం, నలుగురి నోళ్ళలో నూ పడి, నానడం నాకిష్టం లేదు.

మావారు, మోహన్‌గారు, నీవు నేను అనుకున్నట్లు శ్రీరామచంద్రులుకారు. క్రిందటి సంవత్సరం నుండి మా మధ్య అన్నీ కలతలే. ఒకసారి కేంప్ నుండి వచ్చిన సూట్‌కేస్‌లో ఒక జాకెట్ దొరికిందినాకు. ఇంక నేను వివరంగా వ్రాయనవసరం లేదనుకుంటాను. మిగిలిన దంతా నీవే గ్రహించ గలవు. అరోజు నుండి, ఈ రోజు వరకూ నేను మనశ్శాంతిగా గడపిన క్షణం కాని, కడుపునిండాతిని, కంటినిండా నిద్ర పోయిన రోజుగాని లేదు. ఇంక ఆడదానికి జీవితంలో అంతకంటే పనిష్మెంట్ ఏమికావాలి. ఏది కాకూడదు అని భగవంతుణ్ణి నేను కోరుకున్నానో, అదే నాకు ప్రసాదించాడు. నాకు ప్రశాంతి అన్నది లేకుండా చేసాడు, దేవుడు.

ఆయన్ని అప్పుడే నిలదీసి అడిగాను. ఔననిగాని, కాదని గాని అనలేదు. ఆయన అబద్ధం ఆడరని తెలుసు. ఆ మౌనాన్ని అంగీకారంగా భావించుకున్నాను నేను. నా పై చూపే ప్రేమలో ఎటువంటి లోపమూ లేదు. కాని ఆమె సంగతి అడిగితే మాత్రం ఏ సమాధానం చెప్పరు. తరచుగా కాంప్‌ల కెళ్ళడం జరుగుతూనే ఉంది. అది కూడ ఆయన ఉద్యోగంలో తప్పనిసరి డ్యూటీ. ఆయన్ని కేంప్‌లకు వెళ్ళకుండా ఆపలేను. తను వెళ్ళిన తరువాత స్థిమితంగా బ్రతకలేను. నేను జీవితంలో అన్నిరకాల కష్టాలు అనుభవించి, ఇటీవలే ఏదో స్థిరపడ్డాను అని అనుకునే సరికి, దేవుడు నా జీవితంతో ఆటలాడుతున్నాడు. బహుశా యిక ముందు నేను బ్రతికే బ్రతుకు అంతాయిలా కుళ్ళి కుళ్ళి, కృశించి పోయి బ్రతకాలేమో.

నా మనస్సు ఎంత ప్రయత్నించినా దేనిమీద ఉండటం లేదు. అంతా మోహన్ గారి చుట్టూ, ఆయన నాకు చేసిన ద్రోహం చుట్టూ తిరుగుతూనే ఉంది. మనసుని కొంచెం కంట్రోల్ చేసి కోవాలని వంటమనిషిని, తోట మాలిని మాన్పించి వేసాను. పని చేస్తున్నంత సేపు పని మీదే దృష్టి. పనికాగానే తిరిగి నా ఆలోచనలలో నాకు పిచ్చిపట్టేస్తుందేమో నన్నంత బాధగా ఉంది. అలాపిచ్చి పట్టినా బావుండును, మనసుప్రశాంతంగా ఉండును. ఈ నరకం అనుభవించేకంటే, అమ్మా ఎందుకలా ఉన్నావు అని పిల్లలు అడుగుతారు. వాళ్ళకు ఏం సమాధానం చెప్పను. ఇప్పటికి నా భార్యస్థానం దిగజారింది. కొంత కాలం పోతే, ఆవిడకు పిల్లలుపుడితే నా పిల్లలకు, తండ్రి ప్రేమ కూడ తరిగిపోవచ్చు. సుజాతా! నన్నేం చేయమంటావు చెప్పు. చచ్చిపోవాలని అనిపిస్తుంది. అంత ప్రేమగా ప్రాణంలో ప్రాణంగా నన్ను చూసుకునే మోహన్‌గారు యిలా మారిపోయారంటే, అసలు నమ్మబుద్ధి కావడం లేదు. ఇది కలయితే ఎంత బావుణ్ణు అని పిస్తుంది. కాని యిది కలకాదు, వాస్తవం అని నేను వ్రాస్తున్న ఈ ఉత్తరమే సాక్ష్యం. త్వరలో ఉత్తరం వ్రాయి. నన్నేం చేయ మంటావు? మోహన్‌గారితో విడిపోయి విడిగా బ్రతకలేను, కలసి ఉండి ఈ కష్టాన్ని భరించలేను. ఉంటానిక.

కన్నీళ్ళతో నీలత.

* * * * *


నా ప్రియమైన లతా!

ఈ ఉత్తరం చూసి, నీవు ఆశ్చర్యపోవచ్చు. నేను కాంప్‌కి వచ్చి పదిహేను రోజులయింది. మరో అయిదు రోజుల్లో పని పూర్తి చేసికొని, నీ పుట్టిన రోజు నాటికల్లా నీముందుంటాను. ఈ సారినీ కళ్ళలో కన్నీళ్ళకు బదులు, కాంతులే కనబడాలి, సుమా!

లతా! నీకు తెలుసు. నీవంటే నాకెంత ప్రేమో, నేను పరాయి స్త్రీల వైపు, కన్నెత్తి చూడనని కూడ తెలుసు. కాని, ఈ మధ్య నామనసెందుకు మారిందో, ఈ ఉత్తరం పూర్తిగా చదివితేనే అర్థం అవుతుంది. అప్పుడు నీ మొహంలో కనబడే, ఆనందాన్ని చూసి, నాకు పట్టుకోవాలనే ఉంది. కాని నీ దగ్గర నేనుండను, మరి. నీవు నిజంగా నా జీవిత భాగస్వామివి. నాకష్టాల్లో అన్నిటికంటే ఎక్కువగా, నీవే పాలు పంచుకున్నావు. ఆ రోజుల్లో నిన్ను సుఖపెట్ట లేక పోయానని, నా యింటి బాధ్యతలన్నీ నీ నెత్తి మీద వేసానని,నీవు ఏనాడు విసుక్కోలేదు. మన బాధ్యతలన్నీ తీరిపోయాయి నాకు మంచి ఉద్యోగం వచ్చింది. పిల్లలు కూడ పెద్ద వాళ్ళయ్యారు గత మూడు సంవత్సరాలుగా మనం చాల సంతోషంగానే ఉన్నాము.

నీకు అంతస్తుతో పాటు ఆడంబరాలు, ఆభరణాలు పెరిగాయి. ఈనాటికైనా నిన్ను సుఖ పెట్ట గలిగి నందుకు, నేను ఎంతగానో పొంగిపోయాను. కాని నా ఉత్సాహమంతా ఒక్క సంవత్సరంలో నే ధిగిపోయింది. కారణం, హోదాతో పాటు నీకు బద్ధకం, నన్ను పిల్లలను పని వాళ్ళమీద అప్పుడప్పుడు వదిలేయడం జరుగుతుండేది. అయినా నేను బాధపడలేదు. కాని పేరుకి తగినట్లు లతలా ఉండే నీవు, నీ పేరుకి అప్రతిష్ట తెచ్చావు. రోజు రోజుకి నా సంపాదనతో పాటు, నీ శరీరం కూడ పెరిగి పోసాగింది. నీవు నీసంతోషంతో నీ శరీరం గురించి పట్టించుకునే స్థితి ఎప్పుడో దాటిపోయావు. నిన్ను చూస్తుంటే నాకు చాల బెంగగా ఉండేది. నిన్ను లతలాగనే చూడడం నాకిష్టం. మరో రూపంలో నాకిష్టం లేదు. రాను రాను నా పక్కన నిన్ను చూసిన వాళ్ళు, నిన్ను నా అక్క అంటున్నారని తెలిసి చాల బాధపడి అప్పటి నుండీ, డైటింగ్ అదీ మొదలు పెట్టావు గాని, ఏం ఫలితం లేక పోయింది. ఇలాగే మరో రెండేళ్ళు పోతే, నీవు నా భార్యవు కాదేమోనన్న అనుమానం నాకే కలిగేలాంటి పరిస్థితి రావచ్చు.

శరీరం పెరగడంతో పాటు, అందం తరుగుతుంది. అంతేకాదు, అనారోగ్యానికి అది మొదటి మెట్టు. లావయిన శరీరం అనాకారి తనానికి. అనారోగ్యానికి దగ్గర దారి అవుతుంది. నిన్ను పూర్వపు లతలా చేయడం, యిప్పట్లో అయ్యే పనిలా నాకనిపించడం లేదు. ఎందుకంటే మా అక్కయ్యలను, మా స్నేహితుల భార్యలను చూసిన నేను, సన్నగా ఉన్న వాళ్ళను, లావుచేయవచ్చును గాని, లావుగా ఉన్న వాళ్ళను సన్నగా చేయడం చాల కష్టం అని ఎప్పుడో గ్రహించాను. నిన్ను నాకు నచ్చిన రీతిలో మలచుకోవాలంటే చిన్నప్పుడు నేను చదివిన కథ ఒకటి గుర్తుకి వచ్చింది, 'ఒక రాజుగారుంటారు. ఆయనకు సుఖ భోగాలతో, శరీరం విపరీతంగాపెరిగి పోతుంది. రాజుగారికి, తిరిగి సన్నబడాలని కోరిక కలుగుతుంది. కాని రాజ వైద్యులు ఎన్ని మందులు ఇచ్చినా ఫలితం కనిపించలేదు. ఆఖరికి తన శరీరం




తగ్గడానికి సరయిన మందు యిచ్చిన వారికి ఎన్నో మంచి, మంచి బహుమతులు యిస్తానని ప్రకటించారు. అయినా లాభం లేకపోయింది.

ఆఖరికి, ఆస్థాన జ్యోతిష విద్వాంసులలో ఒకాయన వచ్చి 'మహాప్రభూ, ఎందుకు. మీరింత ఆందోళన పడతారు, సన్నబడాలని, ఒక నెల రోజులలో మీరు చనిపోతారు' అని చెబుతాడు. అంతే రాజుగారికి షాక్ తగిలినట్లవుతుంది. 'నీ జ్యోతిషం ఫలించకపోతే నీ తల తీయించి వేస్తాను అని ఆపండితునితో రాజు అంటే, నా తల తీయించడానికి మీరు ఉండరు కదా అంటాడు ఆ పండితుడు. దానితో గాజుగారికి విపరీతమైన బెంగ పట్టుకొని నెల తిరిగే సరికి బక్కచిక్కి పోతాడు. కాని చనిపోడు. అర్థం అయిందికదూ! పండితుడు రాజు గారికి యిచ్చిన మందు. ఆమందే నీ మీద ప్రయోగించాను. మైడియర్, లతా! నిన్ను ఇన్ని రోజులు బాధపెట్టి నందుకు నన్ను మనస్పూర్తిగా మన్నిస్తావు కదూ! ఆ జాకెట్ ఎవరిదో అంత మాత్రం గ్రహించ లేక పోయావు. మూడేళ్ళ క్రితం నీవు కుట్టించుకొని, ఆతరువాత టైట్ అయితే బీరువాలో మూలన పడేసిందే. అది దొరికితే, నేను కేంప్‌కి వెళ్ళేటప్పుడే దాన్ని పట్టుకు పోయాను. నీ అనుమానంతో, అంత మాత్రం గ్రహించలేక పోయావు. ఇన్నాళ్ళ నుండి నీవు పడుతున్న మనోవేదన చూస్తుంటే, మనస్సెంత కరిగి పోయేదో, నన్ను నేను ఎలా నిగ్రహించు కున్నానో, మాటలలో నీకు ఎలా చెప్పగలను. నా కోరిక తీరే వరకూ పట్టుదలగా ఉండడానికి చాల కష్టపడవలసి వచ్చింది.

లతా! నేను వచ్చే కేంప్‌లలో నీవు ఊహించినట్లుగానే ఆడవారికి ఏమీ లోటు ఉండదు. నేను ఊ అంటే చాలు ఎంతో మంది సుందరాంగులను, పట్టుకొని వస్తారు. కాని నేను కేంప్‌లో ఉన్నప్పుడు, నీకు నేను ఎంత దూరంలో ఉంటానో, నీవూ నాకు అంతే దూరంలో ఉంటావు. నాలాగే నీవూ నిగ్రహం కోల్పోతే, నేను సహించ గలనా? నేను సహించలేని అలాంటి పని చేస్తే నీవు సహించలేవని తెలిసి, తప్పటడుగు వెయ్యగలనా? నీతి అనేది ఆడదానికి ఎంత అవసరమో, మగవానికి కూడా అంతా అవసరం, అని నమ్మే వారిలో, నేనొకడిని. ఎప్పటికీ నేను, నీ శ్రీరామ చంద్రుడినే. ఇప్పటి కయినా అంతా, అర్థం అయిందా. ఈ ఉత్తరం చదివిన తరువాత నీ కళ్ళల్లో కనబడే మెరుపు చూడాలని చాల ఆరాటంగా ఉంది. నేను వచ్చే సరికి కాస్త దాస్తావు కదూ! ఉంటానిక.

నీ ప్రియాతి ప్రియమైన
మోహన్. □